క్లుప్తంగా

ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

డీఆర్వో పెద్ది రోజా



గుంటూరు వెస్ట్: ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికలో భాగంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వం, చర్చ పోటీల్లో విజేతలకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బహుమతులు అందజేశారు. విజేతలకు డీఈఓ శైలజ, డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఎస్‌ఓ కోమలి పద్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు బహుమతులు అందజేశారు.

హోంగార్డుల సహకారం అభినందనీయం



నగరంపాలెం: జిల్లాలోని హోంగార్డులు ఐక్యంగా ఒక రోజు వేతనాన్ని అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఐదో తేదీన గ్లోరీ ఫ్లారెన్స్ అనే మహిళా హోంగార్డు ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో హోంగార్డుల నుంచి అందించిన రూ.2.27 లక్షల చెక్కును ఆమెకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. జిల్లా హోంగార్డు ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఎస్ఐ రత్నరాజు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై 'అవగాహన'

లక్ష్మీపురం: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని ప్రచారం చేయడంలో అవగాహన సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని సీనియర్ వైద్యులు డాక్టర్ పీవీఆర్ రామకృష్ణ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పట్ట భద్రుల ఓటర్ల నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి , ఇంజినీర్ సదాశివం, విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య, ఇ.చంద్రయ్య పాల్గొన్నారు.

శ్రీమద్భగవద్గీత దశమ అధ్యాయంలో ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత దశమ అధ్యాయంలోని విభూతియోగ: జ్ఞానయజ్ఞం ప్రవచనాలు మొదలయ్యాయి. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సువీరానందస్వామి (చిన్మయ మిషన్) మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునితో నా లీలావతార విశేషాలను దేవతలుగానీ, మహర్షులు గానీ తెలుసుకోలేరని అన్నారు. ఎందుకంటే అన్ని విధాలుగా ఆ దేవతలకు, మహర్షులకు మూల కారణమైన వాడిని నేనేనన్నారు. యథార్థంగా జన్మరహితునిగా, ఆదిరహితుడై అన్నింటికి కారణమైన వాడ్ని అని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ఘటనపై విచారణ కమిటీ


గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సు, రేడియో గ్రాఫర్ వివాదంపై విచారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం క్యాజువాల్టీలో విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సుపై రేడియోగ్రాఫర్ ప్రవర్తనపై సోమవారం పలువురు నర్సింగ్ సిబ్బంది సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణకు ఆదేశించినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పొత్తూరు సమీపంలో హైవేపై ఆదివారం రాత్రి సమయంలో సుమారు 50-55 సంవత్సరాలు కలిగిన వ్యక్తి మృతి చెంది పడిఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారని పరిశీలించారు. మృతుడు గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో రెండుకాళ్లు విరిగిపోయి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

వెన్నెముక.. అశ్రద్ధ చేయవద్దు

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- 16న వరల్డ్ స్పయిన్ డే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో వెన్నెముక సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పాఠశాల విద్యార్థులు కూడా అధిక బరువు బ్యాగులను మోయడం వలన, కళాశాల యువత తరగతి గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక వెన్నుముక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు. సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా నయం చేయవచ్చు. అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది అక్టోబరు 16న వరల్డ్ స్పయిన్ డే నిర్వహిస్తున్నారు.

సమస్యలకు కారణాలు...

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒక రోజు వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. ఎక్కువ సమయం కంప్యూటర్‌ల ముందు కూర్చుని పనిచేయటం, స్మార్ట్‌ఫోన్‌లు వినియోగిస్తూ ఎక్కువ సేపు ఒకేచోట కూర్చుండిపోవటం, ఊబకాయం, శారీరక శ్రమలేకపోవటం, జీవనశైలిలో మార్పులు, ధూమపానం, కార్లు, ద్విచక్రవాహనాలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయటం, గుంతలు ఉన్న రోడ్లపై వాహనాలు నడపటం, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారిలో వెన్నెముక సమస్యలు వస్తున్నాయి.

జిల్లాలో బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 30 మంది వెన్నెముక సంబంధిత సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్యులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 35 మంది స్పయిన్ సర్జన్స్, 10 మంది న్యూరోసర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 10 మంది వరకు వెన్నెముక సమస్యలతో చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

సహజ అరుగుదల...

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్కులు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. గ్యాప్ ఏర్పడిన సమయంలో కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలు జాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మల, మూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. డిస్క్ జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్లల్లో స్పర్శ తగ్గిపోతోంది. వెన్నెముక ఆకారం మారిపోతోంది.

90శాతం అవే తగ్గిపోతాయి

వెన్నెముకలో డిస్క్ సమస్యలు వచ్చిన మొదటి సారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి డిస్క్ సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటలపాటు నడుముకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడి నీళ్ల కాపడం, ఫిజియోథెరపి, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్క్ సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. వీటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంటుంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

ఇవన్నీ అపోహలే ....

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మరలా మరలా సర్జరీ చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే.

ఆధునిక శస్త్రచికిత్సలు...



వెన్నెముక శస్త్రచికిత్సల్లో అత్యాధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ న్యావిగేషన్, న్యూరోమానిటరింగ్, ఎండోస్కోప్, కీహోల్ ఆపరేషన్లతో వెన్నుముక సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణలో స్టాండింగ్ ఎమ్మార్ఐ వంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, బరువు నియంత్రణలో పెట్టుకోవటం, కూర్చుని పనిచేసేవారు ప్రతి రెండుగంటలకు ఒకసారి లేచి నడవటం, ఎక్కువసేపు ఒంగి పనులు చేయకుండా ఉండటం, అధిక బరువులు ఎత్తకుండా ఉండటం ద్వారా సమస్యలు దరిచేరవు.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్‌సర్జన్, గుంటూరు

ఆలయ ట్రస్ట్‌ల్లో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇవ్వాలి

విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతురావు

నెహ్రూనగర్: రాష్ట్రంలోని ప్రతి హిందూ దేవాలయాల్లో కచ్చితంగా ఒక నామినేటెడ్ పోస్టును విశ్వబ్రాహ్మణులకు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అరండల్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం జరుగనున్న రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో ప్రతి దేవాలయంలో బ్రాహ్మణులకు రెండు నామినేటెడ్ పోస్ట్‌లు కేటాయించేలా చట్టం చేయాలని మంత్రివర్గ తీర్మానం చేయనున్నది దీనిని విశ్వబ్రాహ్మణులుగా స్వాగతిస్తున్నామని చెప్పారు. దేవాలయ నిర్మాణ కర్త స్థాపతి, దేవాలయ నిర్మాణంలో భాగస్వాములైన విశ్వబ్రాహ్మణులను విస్మరించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు హిందూ దేవాలయాల్లో ఒక నామినేటెడ్ పోస్ట్ కేటాయించే విధంగా ప్రత్యేక చట్టం తీసుకువచ్చి విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు అంగలకుదురు సుశీల, రాష్ట్ర సెక్రటరీ కొలగాని నంద వీర ప్రసాద్, పి.కిరణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి, బి.కోటేశ్వర రావు, అత్తలూరు వీర బ్రహ్మాచార్యులు, కదిరి ఈశ్వర చారి పాల్గొన్నారు.

యూజీడీ ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) వ్యవస్థ ఉన్న ప్రాంతాల్లో ఓవర్ ఫ్లో వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆనందపేట, గోరంట్ల తదితర ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లైన్లు, పారిశుద్ధ్యం పనులను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. తొలుత ఆనందపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఓవర్ ఫ్లో వలన మురుగు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి, తక్షణం నీటిని బెయిల్ అవుట్ చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈలు కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఏసీపీ ఫజులూర్ రెహ్మాన్, డీఈఈ సతీష్, ఎంహెచ్‌ఓ రాంబాబు, ఆర్‌ఓ రవి కిరణ్ రెడ్డి, కార్పొరేటర్ ఆబీద్ బాషా పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకారం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌గా కె.నాగమల్లేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థలో ఎస్‌ఈగా పనిచేస్తున్న ఆయన్ను ఇటీవల జరిగిన ఇంజినీర్ల బదిలీల్లో భాగంగా గుంటూరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఈగా పనిచేస్తున్న ఎం.శ్యాం సుందర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్



నగరంపాలెం బీసీ కార్పొరేషన్ ఎదురు రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న మ్యాన్ హోల్



నెహ్రూనగర్ 10వలైనులో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ మ్యాన్ హోల్స్ సక్రమంగా కనిపించకపోవడంతో వాహనదారులు అందులోపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. ప్రతి రోజు వార్డు ఎమినిటీ సెక్రటరీలు వార్డుల్లో పర్యటించి, ఎక్కడైన సమస్యలుంటే నోట్ చేసుకుని వాటిని ఏఈల దృష్టిలో ఉంచి పరిష్కారించాల్సి ఉండగా సెక్రటరీలు ఆ దిశగా పనిచేయడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన ఏఈలు కూడా పట్టించుకోకపోవడంతో సమస్యగా మారింది.

నగరంలో జడివాన

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులకు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు, వేమవరం గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. వర్షాలు పడుతుండటంతో ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వారంలో ఒ కరోజు ఫ్రిడ్జ్‌లు శుభ్రంచేసుకోవాలని, మంచినీటి బిందెలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కాలువల్లో మురుగు నిలబడకుండా చూడాలని లేకుంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి రోగాలు వస్తాయని తెలిపారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎంలు విజయరాణి, ఏసమ్మ, మేల్ అసిస్టెంట్లు రాజశేఖర్, నరసింహారావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో తెనాలి చిన్నారుల నృత్యం



తెనాలి: టీటీడీ నిర్వహణలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన తిరుమల 'శ్రీవారి' బ్రహ్మోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి యువనర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందానికి నాట్యం చేసే అవకాశం లభించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 12వ తేదీ రాత్రి తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. అన్నమాచార్య కీర్తనలకు తెనాలి చిన్నారులు కూచిపూడి సంప్రదాయరీతిలో లయబద్ధంగా నర్తించారు. అన్నమాచార్య ప్రాజెక్టు అధికారుల అభినందనలను అందుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు నృత్య గురువు తేజస్విప్రఖ్య, ఆమె శిష్యబృందానికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ కేంద్రం ప్రారంభం



చేబ్రోలు కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటరు పత్రాలు ప్రదర్శిస్తున్న టీచర్లు

చేబ్రోలు: చైతన్యవంతులైన పట్టభద్రులు ప్రజా పక్షం వహించే ప్రజా మేధావులను ఓటు వేసి చట్ట సభలకు పంపడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. చేబ్రోలు యూటీఎఫ్ మండల కార్యాలయంలోని ఉపాధ్యాయ భవన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో జరగనున్న కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే విజయ రాజు, పి.పార్థసారథి కోరారు. 2021వ సంవత్సరం, అక్టోబర్ 31వ తేదీ లోగా డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ నవంబర్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్ ద్వారా ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు, ఎల్ఎన్ సహదేవుడు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయానికి రూ.2 లక్షల విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ చినవెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసిన మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు సోమవారం రూ.2,01,117లు విరాళమిచ్చారు. ఆలయ కార్య నిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ దనాల రాజామారావు మహంకాళి అమ్మవారికి రూ.1,00,001, ఈవూరి రామాంజనేయులు రూ.1,01,116 ఆలయ అభివృద్ధి నిమిత్తం అందజేశారని చెప్పారు. అనంతరం దనాల రాజారావు, ఈవూరి రాంజనేయులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

ఫిర్యాదులను వచ్చే వారానికి పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



కౌన్సిల్ హాల్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందజేస్తున్న అర్జీలను మరుసటి సోమవారానికి పరిష్కారం చేయాలని, నగరపాలక సంస్థ పరిధి కాని, పరిష్కారం చేయడానికి వీలులేని వాటికి విభాగాధిపతి తగిన వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 5, అకౌంట్స్ విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుంటూరు నగరంలో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించేందుకు 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని 22 శానిటరీ డివిజన్లకు సీనియర్ అధికారులను పారిశుద్ధ్యం పర్యవేక్షణకు విధులు కేటాయించినట్లు చెప్పారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్యంతో పాటు, తాగునీరు సరఫరా, రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు గుర్తిస్తే తక్షణం తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న ఆవులను బుధవారం నుంచి వెంగళాయపాలెంలోని జీఎంసీ బందెలదొడ్డికి తరలించి, రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు అందజేత

గుంటూరు నగరపాలక సంస్థ పార్కు విభాగంలో విధులు నిర్వహించే కార్మికులకు రక్షణ పరికరాలను కమిషనర్ పులి శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం హ్యాండ్ గ్లౌజులు, లాంగ్ బూట్లు, రెయిన్‌కోట్లు, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు అందజేయడం జరిగిందన్నారు.

21న సమకాలీన రాజకీయాలపై సభ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: సమకాలీన రాజకీయ పరిణామలపై ఈనెల 21న సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు వాగ్దానం చేసినా విధంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా సున్నితమైన అంశాలను రెచ్చగొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.8,100 కోట్లు ప్రజలపై భారాలు మోపే ప్రయత్నం విరమించాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 18న విద్యుత్ సంస్థల కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణ రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, జిల్లా నాయకులు బి.కోటేశ్వరి, బి.వెంకటేశ్వరరావు, ఎం.ఎ.చిస్టీ, ఎల్.అరుణ పాల్గొన్నారు.

అలరించిన మల్లాది సూరిబాబు గాత్ర కచేరి



కచేరిలో గానం చేస్తున్న విద్యాంసులు

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవంలో భాగంగా వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు సోమవారం రెండో రోజుకి చేరాయి. సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ విద్వాంసులు మల్లాది సూరిబాబు విశ్లేషణాత్మకంగా సంగీత మూర్తి త్రయ శిష్య, ప్రశిష్య వాగ్గేయకార రచనలను శ్రావ్యంగా అలపించారు. సంగీతాభిమానులను అలరించాయి. వయోలిన్‌పై ఎ.కామాక్షి(విజయవాడ), మృదంగంపై బుర్ర శ్రీరామ్(చెన్నై) చక్కని వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, వై.రాజ్యలక్ష్మీ, ఫణితేజ పాల్గొన్నారు.

పొట్టేల్ చిత్ర బృందం సందడి



నంబూరు వీవీఐటీలో సందడి చేస్తున్న పొట్టేల్ చిత్ర బృందం



చిత్రబృందాన్ని సన్మానిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల ప్రతినిధులు

పెదకాకాని: గ్రామీణ నేపథ్యంతో యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందుతున్న పొట్టేల్ చిత్ర బృందం సోమవారం వీవీఐటీలో సందడి చేసింది. మండలంలోని నంబూరు వీవీఐటీని అక్టోబర్ 25వ తేదీ విడుదల కానున్న పొట్టేల్ చిత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా చిత్రబృందం సందర్శించింది.

ఆర్‌వీఆర్‌జేసీలో..

గుంటూరు రూరల్: స్ఫూర్తినిచ్చే సందేశాత్మక చిత్రాలు ప్రేక్షక ఆదరణతో పాటు అవార్డులను సాధిస్తాయని, వాస్తవాలు ప్రతిబింబించేలా మంచి కథనాలతో కూడిన చిత్రాలను సినీ పరిశ్రమ ప్రోత్సహించాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. ఈనెల 25న విడుదల కానున్న పొట్టేల్ తెలుగు చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం చౌడవరంలోని చిత్ర బృందం సందడి చేసింది.

నటీనటులు యువ చంద్ర, అనన్య నాగళ్ళ మాట్లాడుతూ సినిమాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.